క్లుప్తంగా

ఆర్‌యూ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి తక్షణమే రూ.500 కోట్లు కేటాయించాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాయలసీమకు ముఖ ద్వారమైన కర్నూలులో ఆర్‌యూ అభివృద్ధి ఎక్కవ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని విమర్శించారు. వర్సిటీ ఏర్పాటై 17 సంవత్సరాలు గడిచిందని పరిశోధన విద్యను అభివృద్ధి చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్‌గా మార్చాలని, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

తైక్వాండో శిబిరాన్ని వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద మున్సిపాల్ పార్కులో ఏర్పాటు చేసిన తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరాన్ని చిన్నారులు వినియోగించుకోవాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు స్పష్టం చేశారు. శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. తైక్వాండో వంటి క్రీడల్లో శిక్షణ తీసుకుంటే జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవచ్చన్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా నెలరోజుల పాటు శిక్షణలో రాణించాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

తైక్వాండోలో రాణించాలి



తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): యుద్ధ క్రీడ తైక్వాండోలో రాణించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. ఆదివారం స్థానిక వీకర్ సెక్షన్ కాలనీలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మతో కలిసి కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టు వదలని క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండేందుకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడుతుందన్నారు. 2000 సంవత్సరం నుంచి తైక్వాండో క్రీడాంశాన్ని ఒలింపిక్స్‌లో చేర్చారన్నారు. ఇటువంటి గుర్తింపు ఉన్న క్రీడల్లో రాణించాలన్నారు. కోచ్ షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

'దేవుడా' శతకం ఆవిష్కరణ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: తెలుగు సారస్వత వైభవం ఆధ్వర్యంలో ఆచార్య గుబ్బా బాలస్వామి రచించిన 'దేవుడా' శతకం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగు సారస్వత వైభవం అధ్యక్షుడు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మంచి రచనల ద్వారా సంస్కార వంతులైన యువతను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నన్నయ్య, తిక్కన, పోతన, శ్రీశ్రీ లాంటి మహనీయుల రచనలు నేటి సమాజానికి ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రమౌళిని, ఆరేపల్లి వరలక్ష్మి, తొగట సురేష్ బాబు, ముద్రిక భాస్కర్ మాట్లాడారు. సాహితీ వేత్తలు, కవులు, రచయితలు, పాల్గొన్నారు.

వైద్య విద్య అభివృద్ధికి కృషి

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలో వైద్య విద్య అభివృద్ధికి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఎన్నికైన డాక్టర్ పి.చంద్రశేఖర్ కృషి చేయాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ కోరారు. ఆదివారం టీజీ వెంకటేష్‌ను ఇంటికి వెళ్లి డాక్టర్ పి.చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ పదవి కర్నూలుకు చెందిన వైద్యుడికి దక్కడం రాయలసీమ వాసులకు గర్వకారణమన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తన వృత్తిగత జీవితంలో ప్రతి సందర్భంలోనూ టీజీ వెంకటేష్ తోడ్పాటునందించారని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సభ్యులు వాసుదేవమూర్తి, నాగేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

● అధ్వానంగా రోడ్లు



రోడ్డు మధ్యలో నెర్రలిచ్చిన దృశ్యం



రోడ్డుపై ఉన్న గుంతలు

కల్లూరు: కల్లూరు అర్బన్ 37, 41వ వార్డుల్లో విస్తరించిన వీకర్‌సెక్షన్ కాలనీలో రోడ్లు అధ్వానంగా మారాయి. కోడుమూరు రోడ్డులోని బీడీ వర్కర్ల కాలనీలో రోడ్డు మధ్యలో నెర్రలిచ్చింది. అలాగే 41వ వార్డులోని వీకర్‌సెక్షన్ కాలనీలో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ఆయా రోడ్లపై ఎక్కువగా మధ్య తరగతి ప్రజలు వివిధ జీవనోపాధుల నిమిత్తం ప్రయాణిస్తుంటారు. దెబ్బతిన్న రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు ఏ మాత్రం అదుపు తప్పినా కింద పడి గాయాలపాలవ్వాల్సిందేనని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

'కాలుష్య కాసారంగా నగరం'

కర్నూలు (టౌన్): నగరం కంపు మయంగా మారింది. చెత్తను తొలగించడం లేదు. మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. పట్టించుకునే నాథుడు లేడు అని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి నగరపాలక సంస్థ అధికారులను ప్రశ్నించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆ సంఘం ప్రతినిధులు ఆదివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని పరిశీలించారు. ఎన్ని రోజులవుతున్నా శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా నగరంలో చెత్త సేకరణ అధ్వానంగా మారిందన్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కార్మికులు సక్రమంగా పనిచేయకపోవడం వల్లే ఈ సమస్య వస్తోందన్నారు. క్లాప్ ఆటోలు లేకపోవడంతో చెత్త సేకరణ నిలిచిపోయిందన్నారు. రోడ్లపై



పాతబస్టాండ్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగును పరిశీలిస్తున్న పట్టణ పౌర సంఘం సభ్యులు

వెళ్లాలంటే దుమ్ము, దూళి, కంపు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని కోరారు. సభ్యులు సర్దార్, మొహిద్దీన్, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

మంచిమార్గానికి దిక్సూచి భగవద్గీత

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో జరుగుతున్న చిన్మయ బాలల వేసవి సంస్కార సాధన శిబిరాన్ని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుడు శంకర్ శర్మ సందర్శించి విద్యార్థులకు సందేశమిచ్చారు. చిన్నపిల్లల్లో ఆధ్యాత్మిక ప్రవృత్తిని పెంచేందుకు సంస్కార సాధన లాంటి కార్యక్రమాలు అనేకం నిర్వహించాలన్నారు. సనాతన ధర్మం ఒక మతానికి ఒక వర్గానికి చెందినది కాదని అందరూ ఆచరించాలన్నారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మంచి మార్గంలో నడిచేందుకు భగవద్గీత దిక్సూచిలా నిలుస్తుందన్నారు. అనంతరం డాక్టర్ శంకర్ శర్మను సన్మానించారు. నైస్



మాట్లాడుతున్న చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి

కంప్యూటర్స్ అధినేత డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చిన్మయ మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫీ'జులుం'కు వ్యతిరేకంగా పోరాటం

కర్నూలు(సెంట్రల్): కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సెలవు దినాల్లోనూ ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నా బోర్డు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అన్యాయమన్నారు. నిబంధనలు అతిక్రమించిన కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన యూనివర్సిటీలు, నిధులపై కనీసం రాష్ట్రం ప్రశ్నించడం లేద



మాట్లాడుతున్న డి.సోమన్న

న్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం, డిప్యూటీ సీఎం ప్రశ్నించడం లేదన్నారు. కార్యక్రమంలో బాలాజీ, షామీర్ అబ్దుల్లా, సామెల్ వీరాంజనేయులు, జగదీష్ పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో రైతులను అప్రమత్తం చేయండి

- లైసెన్స్ కలిగిన డీలరు నుంచి ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలి
- దేశీ శిక్షణా కార్యక్రమంలో విశ్రాంత జేడీఏ జయచంద్ర సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున విత్తన కొనుగోలులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని విశ్రాంత జేడీఏ జయచంద్ర ఇన్‌పుట్ డీలర్లను కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దేశీ కార్యక్రమ సమన్వయ కర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ.. విత్తనాలను ఎక్కడపడితే అక్కడ కొనుగోలు చేయరాదని వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలరు నుంచి ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల కొనుగోలుకు సంబంధించి విధిగా బిల్లు తీసుకోవాలని, బిల్లులో రైతు పేరు,



మాట్లాడుతున్న విశ్రాంత జేడీఏ జయచంద్ర

లాట్ నంబరు తదితర పూర్తి వివరాలు ఉండాలన్నారు. బిల్లు, విత్తనాల సంచి ట్యాగ్‌లను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. విత్తనం వేసుకోవడానికి ముందుగా తడిబట్టలతో మొలక కట్టి మొలక శాతాన్ని పరీక్షించుకోవాలని, విత్తనం నిద్రావస్థను పోగొట్టేందుకు గాఢ నాత్రకా ఆమ్లంతో 12 గంటలు నానబెట్టాలన్నారు. లూజు విత్తనాలను కొనుగోలు చేయరాదని సూచించారు. విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

నిజాయితీ, నిబద్ధతకు ప్రతిరూపం ఆవోపా

కర్నూలు(అర్బన్): నిజాయితీ, నిబద్ధతకు కర్నూలు ఆవోపా ప్రతి రూపంగా నిలుస్తోందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆవోపా సదన్‌లో ఆవోపా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఎంవీ సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ రాష్ట్రంలోనే కర్నూలు ఆవోపా ముందుందని చెప్పారు. కార్యక్రమంలో టీజీ శివరాజ్, చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు, రత్నప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ...

ఆవోపా అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా మురళీక్రిష్ణ, కోశాధికారిగా పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వంకదారి చిన్న నర



ఆవోపా నూతన కార్యవర్గం

సింహులు, మేడా విజయకుమార్, పెరుమాళ్ల మురళీక్రిష్ణ, సంయుక్త కార్యదర్శులుగా కందూరి కిరణ్‌కుమార్, ఇల్లూరు సూర్యనారాయణ, కొట్టా శ్రీనివాసులు, పీఆర్‌ఓగా కాసుల పార్థసారథితో పాటు ఆరుగురిని ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఆవోపా కార్యవర్గం అధిక సంఖ్యలో హాజరైన ఆర్యవైశ్య వర్గీయుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.

రంగస్థల కళాకారుల సంఘం సమావేశం

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగింది. సమావేశంలో ప్రముఖ రంగస్థల కళాకారులైన లొద్దిపల్లె అల్లాబకాష్, ఎన్టీఆర్ అవార్డు గ్రహీతలు బీసీ కృష్ణ, ఎస్.శ్రీనివాసులు చిత్రపటాలను తెలుగు వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ, విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి, సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య ఆవిష్కరించారు. అంకయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను పార్క్‌గా మార్చడంతో కళాకారుల ప్రదర్శనలకు వేదిక లేకుండా పోయిందన్నారు. కళాకారులు ఐక్యంగా ఉండి కళా వేదికను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు పొందిన సంగీత విద్వాంసులు డాక్టర్ భగవాన్ ప్రకాష్‌బాబును సన్మానించారు. కళాకారులు దస్తగిరి, కళా ప్రియ తిరుపాలు, బైలుప్పల షఫీ, డాక్టర్ సభాన్, వీవీ రమణారెడ్డి, హనుమంతరావు చౌదరి, సయ్యద్ రోషన లి, సీబీ అజయ్ కుమార్, టీ రాజశేఖర్‌రావు, గోవిందరాజులు, పార్వతయ్య, అరుణ కుమారి, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహించి ప్రజలను ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.

ట్యాంక్‌ను వినియోగంలోకి తేవాలి



ట్యాంక్‌ను చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 31వ వార్డు పద్మావతి నగర్‌లో గత నెలరోజులుగా ట్యాంక్ నుంచి నీరు రావడం లేదని, ట్యాంక్‌ను వినియోగంలోకి తేవాలని సీపీఎం నగర నాయకులు యేసు డిమాండ్ చేశారు. వేసవి కాలం కావడంతో ట్యాంక్ నుంచి నీళ్లు వస్తే కాలనీ వాసులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. సీపీఎం నాయకులు తిమ్మప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

సి.బెళగల్: మండల ప్రజలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఇళ్ల స్థలాలు లేని గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలతో ఆయా గ్రామాల వీఆర్వోలను సంప్రదించి వివరాలను నామోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం వివిధ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధిగా నియమితులైన షేక్ హఫీజ్ మహమ్మద్ ఇలియాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీగా నియమితులైన షేక్ యూనిస్ బాష ఆదివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయ



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న షేక్ మహమ్మద్ ఇలియాస్

న్నారు. పదవులు పొందిన వారందరూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయానికి అనుగుణంగా పని చేసి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన మ్యాజిక్ షో

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్ పోగ్రామ్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన మ్యాజిక్ షో అలరించింది. డ్రాయింగ్ మాస్టర్ సుధీర్ రాజు తన మ్యాజిక్‌తో విద్యార్థులను అబ్బురపరిచారు. రీసోర్స్ పర్సన్‌లు హిందీ ఉపాధ్యాయిని చాంద్‌బీ హిందీ ఎలా మాట్లాడాలి, ఉపాధ్యాయులు యాంగటీశ్వరప్ప ఆహారపు అలవాట్లు, అనారోగ్య సమస్యలు, ఉపాధ్యాయిని ఇందుమతి ధ్యానం గురించి, రవికిరణ్‌రెడ్డి కథలు చెప్పడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్



మ్యాజిక్ షో నిర్వహిస్తున్న సుధీర్ రాజు, చిత్రంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్

పాల్గొని ప్రసంగించారు. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధస్సు

కర్నూలు(అగ్రికల్చర్): మేధస్సుతో కూడిన ఆట చదరంగం అని, ఇందులో ప్రతిఒక్కరూ రాణించవచ్చని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ తెలిపారు. ఆదివారం కర్నూలు బిర్లా కాంపౌండ్‌లోని జగదీష్ మాల్‌లో కర్నూలు చెస్ అకాడమీని సీఐ శ్రీరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలతో చదరంగం(చెస్) ఆడి అలరించారు. చదరంగంలో రాణించాలంటే పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. ఈ ఆట మనలోని మేధస్సును వెలికి తీస్తుందని చెప్పారు. చిన్నారులు మొదలుకొని ప్రతి ఒక్కరూ ఇష్టంగా ఆడదగినది చెస్ మాత్రమేనని పేర్కొన్నారు. చెస్ అకాడమీని యువత సద్విని



పిల్లలతో చెస్ ఆడుతున్న సీఐ శ్రీరామ్

యోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ చంద్రశేఖర్‌నాయక్, మహేంద్రనాయక్, చెస్ అకాడమీ ప్రతినిధులు విజయమనోహర్, సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

భగీరథుడి విగ్రహం ఏర్పాటు చేయాలి

కర్నూలు(అర్బన్): వందల సంవత్సరాలు ఒంటి కాలిపై శివుడి కోసం తపస్సు చేసి దివి నుంచి భువికి గంగను తీసుకువచ్చి తన పితృదేవతలకు ముక్తిని కలిగించిన భగీరథుడి విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని జిల్లా శ్రీ భగీరథ సగర/ ఉప్పర సంఘం అధ్యక్షుడు బీ.సత్యన్న కోరారు. ఆదివారం భగీరథ జయంతి సందర్భంగా సగర/ ఉప్పర సంఘం నేతలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యన్న మాట్లాడుతూ.. ఏటా వైశాఖ శుద్ధ సప్తమి రోజున భగీరథుని వారసులుగా సగర/ ఉప్పర కులస్థులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆయన జయంతిని నిర్వహిస్తున్నారన్నారు. భగీరథుని జయంతిని పండుగలా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సగర/ఉప్పర సంఘం నేతలు

ఈ నేపథ్యంలో వచ్చే జయంతి నాటికి జిల్లా కేంద్రంలో భగీరథుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆ సంఘం నాయకులు నాగభూషణం, రామక్రిష్ణ తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 10 ఎడ్ల జతలు పాల్గొన్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా, అక్కెంపల్లెకు చెందిన కోనేపల్లె ఇంద్రారెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో రాతిదూలాన్ని 4800 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.50 వేలను కై వసం చేసుకున్నాయి. కర్నూలు మండలం, రేమటకు చెందిన చిన్న గిడ్డయ్య నాయుడు వృషభాలు 4706 అడుగులు లాగి రూ.40 వేలు, తెలంగాణ రాష్ట్రం కొత్తకోటకు చెందిన డాక్టర్ గుర్నాథ్, నందికొట్కూరు మండలం, మల్యాల గ్రామానికి చెందిన షేక్ మైమున్నా (విడిజత) వృషభాలు 4609 అడుగులు లాగి రూ.30 వేలు, నంద్యాల మండలం, పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు 4500 అడు



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

గులు లాగి రూ.20 వేలు గెలుపొందాయి. అలాగే నాగర్‌కర్నూలు జిల్లా, పెద్ద కొత్తపల్లె మండలం, చంద్రకల్‌కు చెందిన వెంకటేశ్వరరావు వృషభాలు 4496 అడుగులు లాగి రూ.10 వేలు, జక్కిలేరుకు చెందిన డాక్టర్ రషీద్, గొల్లపల్లెకు చెందిన వారాది రామ్‌చరణ్ (విడి జత) వృషభాలు 3947 అడుగులు లాగి రూ.5 వేలు దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు వాడాల రామానాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

రమణీయం.. వేంకటేశ్వరుని రథోత్సవం

ఓర్వకల్లు: ఉయ్యాలవాడ గ్రామంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వాముల వారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లె నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం వైభవంగా నిర్వహించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ తదితరులు శనివారం రాత్రి రథాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శశిధర్‌శర్మ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, రథోత్సవానికి సిద్ధం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో అధిష్టింపజేసి భాజాభజంత్రీలు, డప్పుల మధ్య రథశాల వద్దకు చేర్చారు. రథశాల వద్ద క్రతువులు పోసి రథాంగహోమం, కుష్మాండబలి సమర్పించి స్వాముల వారిని రథంపైకి చేర్చారు. అశేష భక్తజన సందోహం మధ్య తరలిపోతున్న రథంపైకి భక్తులు పూలు, పండ్లు విసురుతూ కరచాల ధ్వనులతో గోవింద నామస్మరణ చేశారు. అనంతరం స్వాముల వారి రథాన్ని ముందుకు కదిలించి, స్థానిక సుంకులమ్మ గుడి వరకు వెళ్లిన రథాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆకట్టుకున్న 'ఉట్ల' ప్రదర్శన

వేంకటేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా అనాదిగా వస్తున్న «ఉట్ల» ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కుమ్మరి కులస్తులు వెదురు బొంగులకు వేలాడదీసిన ఉట్లపై కుండలను ఉంచుతారు. యాదవ కులస్తులు వేలాడుతున్న కుండలను కర్రలతో కొడుతుండగా కుమ్మరి వాళ్లు కుండలకు తగలకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తారు. చివరకు యాదవులే జయిస్తారు. స్థానిక కృష్ణుడి దేవాలయం, రథశాల, వీరభద్రస్వామి దేవాలయం వద్ద ఉట్ల ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణారెడ్డి, కృష్ణయ్య చౌదరి, ఎద్దుల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో చందన యాత్ర

● జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం చందన యాత్ర ఉత్సవం, భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ సంకీర్తనలు ఆలపించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. ప్రతిఒక్కరూ భగవద్గీతలోని విషయాలను తెలుసుకోవాలన్నారు. జీవితంలో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు, చందన యాత్ర ఉత్సవంలో పాల్గొన్న భక్తులు